క్లుప్తంగా

కొత్త రేషన్‌కార్డుకు దరఖాస్తు చేసుకోండి

బొబ్బిలిరూరల్: కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దారు ఎం.శ్రీను ఓ ప్రకటనలో బుధవారం కోరారు. కొత్తగా పెళ్లయిన జంటలు కొత్త కార్డుల కోసం, పాతకార్డుల్లో మృతుల పేర్లు తొలగింపు, కొత్త వ్యక్తుల పేర్ల నమోదు వంటి వాటి కోసం సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అసంఘటిత కార్మికులకు బీమా



కార్మికుల పేర్లు నమోదు చేస్తున్న లేబర్ ఆఫీసర్ కొండలరావు

వంగర: అసంఘటిత కార్మికులంతా బీమా చేయించుకోవాలని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ బి.కొండలరావు అన్నారు. బుధవారం మండలంలోని మద్దువలస గ్రామంలో పలువురు అసంఘటిత కార్మికులతో ఈ–శ్రమ్ పోర్టల్‌లో పేర్లు నమోదు చేయించారు. 18 నుంచి 59 ఏళ్ల వయసు కార్మికులంతా బీమా సదుపాయం పొందేందుకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఆధార్‌కార్డుకు లింక్ అయిన మొబైల్ నంబర్‌తో నమోదు కావాలన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి ప్రమాదవశాత్తు పాక్షిక వైకల్యం కలిగితే రూ.1 లక్ష, శాశ్వత వైకల్యం లేదా మరణిస్తే రూ.2 లక్షల బీమా పరిహారం అందుతుందని లేబర్ ఆఫీసర్ తెలిపారు.

రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం



రాజకీయ నాయకులతో మాట్లాడుతున్న ఈఆర్‌వో సవరమ్మ

రాజాం: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో నియోజకవర్గంలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఈఆర్‌వో టి.సవరమ్మ బుధవారం సమావేశమయ్యారు. ఓటరు జాబితాలపై చర్చించారు. పక్కాగా ఓటరు జాబితా తయారీకి సిబ్బందికి సహకరించాలని, ఓటర్లలో మృతుల వివరాలు తెలియజేసి ఓటరు జాబితా నుంచి వారి పేర్లు తొలగించేలా చూడాలని ఈఆర్‌వో కోరారు. కార్యక్రమంలో డీటీ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

తప్పులు లేకుండా ఆధార్ నమోదు చేయాలి



ఆధార్ నమోదును పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

రాజాం సిటీ: చిన్నారులకు సంబంధించి, తప్పులు లేకుండా ఆధార్ నమోదు చేయాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని పొగిరి గ్రామంలో నిర్వహిస్తున్న స్పెషల్ ఆధార్ డ్రైవ్‌ను ఆయన బుధవారం పరిశీలించారు. ప్రతి ఒక్కరూ ఆధార్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని, ఫోన్ నంబర్ లింకుతో పాటు ఆధార్‌లో మార్పులు చేర్పులను సవరించుకునేందుకు ఇదో చక్కని అవకాశమన్నారు.

సారా నిర్మూలన బాధ్యత అందరిదీ..

మెంటాడ: సారా నిర్మూలన బాధ్యత అందరిదీ అని గజపతినగరం ఎక్సైజ్ సీఐ జె.జనార్ధనరావు అన్నారు. మండలంలోని పోరాం గ్రామంలో సారా నిర్మూలనపై అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఏ గ్రామంలో సారా తయారు చేసినా, విక్రయించినా, తరలించినా సమాచారం ఇవ్వాలని, సమాచారమిచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ బి.అరుణకుమారి, వీవోఏ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

సర్వేలు ఫుల్.. సేవలు నిల్!



సంతకవిటి మండలంలోని ఓ సచివాలయం

- సచివాలయ సేవలకు ప్రభుత్వం స్వస్తి
- సిబ్బందికి లేనిపోని సర్వేలు అప్పగింత
- ఉద్యోగులపై పెరుగుతున్న పనిఒత్తిడి
- సేవలు అందడం లేదని ప్రజలు ఆందోళన

రాజాం సిటీ: సచివాలయాలపై కూటమి సర్కారు చిన్నచూపు చూస్తోంది. గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో కొత్తగా తీసుకువచ్చిన ఈ సచివాలయ వ్యవస్థ ద్వారా సుపరిపాలన సులభతరమైంది. గ్రామంలోనే ప్రజలకు అవసరమైన పౌరసేవలన్నీ లభించేవి. దీంతో మండల కేంద్రాల్లోని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పని తప్పింది. ప్రస్తుతం ఇదే వ్యవస్థ కొనసాగితే సచివాలయాలను తీసుకువచ్చిన మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందన్న అక్కసుతో ఆ వ్యవస్థను ఇప్పుడు నిర్వీర్యం చేసే దిశగా చంద్రబాబు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఒక్క ఉద్యోగినీ ప్రజలకు అందుబాటులో లేకుండా చేస్తున్నారు. రకరకాల సర్వేల పేరిట సిబ్బందిని క్షేత్రస్థాయిలో తిరిగేలా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తమకు సకాలంలో సేవలు అందడం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కుల, ఆదాయ ఇతర ధ్రువీకరణ పత్రాల కోసం మండల కేంద్రాల్లోని మీ సేవా కేంద్రాలకు వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు.

సర్వేలతో శ్రమ వృథా..

సర్వేల పేరిట సచివాలయ సిబ్బందిని ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తోంది. పింఛన్ల పంపిణీ, డోర్ టూ డోర్ చెత్త సేకరణ, ఆధార్ లేని పిల్లలకు ఆధార్, పుట్టిన పిల్లలకు బర్త్ సర్టిఫికెట్, ఆధార్ నమోదు, వర్క్‌ఫ్రమ్ హోమ్ పేరిట 18 నుంచి 50 ఏళ్ల వయసులోపు వారి జాబితా తయారీ, నాన్ ఏపీ రెసిడెన్షియల్ వారిని గుర్తించడం, హౌస్ జియో ట్యాగింగ్, కుటుంబ సభ్యుల వివరాల సేకరణ, ఈకేవైసీ అప్‌డేట్, ఫ్యామిలీ మైగ్రేషన్, మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ వంటి రకరకాల సర్వేలు చేయిస్తున్నారు. అయితే సర్వే అంతా చేసిన తర్వాత ఇంటి యజమానికి వచ్చిన ఓటీపీని చెప్పేందుకు నిరాకరించడంతో చేసిన సర్వే, పడిన శ్రమ అంతా వృథా అవుతోందని సిబ్బంది వాపోతున్నారు.

సచివాలయాలు వెలవెల..

రాజాం నియోజకవర్గంలో రాజాం పట్టణంలో 11 సచివాలయాలతో పాటు మండలంలో 17 సచివాలయాలు, రేగిడి మండలంలో 25, వంగర మండలంలో 19, సంతకవిటిలో 24 సచివాలయాలు ఉన్నాయి. వీటిల్లో 700 మంది ఉద్యోగుల వరకు విధులు నిర్వహిస్తున్నారు. ప్రతి శాఖకు ఓ ఉద్యోగి చొప్పున ప్రతి సచివాలయంలో 11 మంది ఉన్నారు. గత ప్రభుత్వ హయాంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్ల సమన్వయంతో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ కుల, ఆదాయ సర్టిఫికెట్ల దగ్గర నుంచి ప్రతి ప్రభుత్వ సంక్షేమ పథకమూ పారదర్శకంగా అందేది. కొత్తగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ సేవలను నిలిపివేశారు. వలంటీర్ వ్యవస్థ పూర్తిగా లేకుండా చేయడంతో పాటు సచివాలయ సిబ్బంది కూడా సచివాలయంలో ఉండకుండా చేస్తున్నారు. వివిధ రకాల సర్వేల బాధ్యతలను వారికి అప్పగించి, నిత్యం వారు బయట తిరిగేలా చేస్తున్నారు. సెలవులతో సంబంధం లేకుండా సర్వేలని, టార్గెట్‌లు అని వారితో పనిచేయించుకుంటున్నారు. తీవ్రమైన పనిఒత్తిడికి గురవుతున్నామని పనిభారం తగ్గించాలని సచివాలయ సిబ్బంది ఆ మధ్య ఆందోళనలు చేపట్టిన విషయం తెలిసిందే. సచివాలయాలకు అనుబంధంగా ఉన్న రైతు సేవా కేంద్రాల్లోనూ ఇదే పరిస్థితి. సిబ్బంది సేవలు అంతగా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని రైతులు గగ్గోలు పెడుతున్నారు.



చెత్త సేకరణ పనిలో సచివాలయ సిబ్బంది(ఫైల్)

గతంలోనే బాగుండేది..

గత ప్రభుత్వ హయాంలోనే బాగుండేది. అన్ని రకాల పౌరసేవలు సచివాలయంలోనే అందేవి. ఇంటికి వచ్చి మరీ మనకు కావాల్సిన ధ్రువపత్రాలు అందించేవారు. సంక్షేమ పథకాల కోసం కూడా ఎవరి దగ్గరకు వెళ్లాల్సిన అవసరం ఉండేది కాదు. ఇప్పుడు అలా కాదు.. ఏదైనా సర్టిఫికెట్ కావాలంటే మండల కేంద్రానికి వెళ్లాల్సిందే.. రోజంతా నరకయాతన పడాల్సిందే..

– ఎల్.గోవిందరావు, రాజాం

మండల కేంద్రానికి పరిగెత్తాల్సి వస్తోంది..

సచివాలయాల్లో సేవలు అంతగా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో మాదిరి సేవలు పునరుద్ధరించాల్సిన అవసరం ఉంది. మండల కేంద్రాలు, మీ సేవా కేంద్రాలకు పరుగులు తీసే పాతరోజులు మళ్లీ కూటమి ప్రభుత్వ హయాంలో వచ్చాయి. ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

– టి.అచ్చెన్నాయుడు, చిన్నశిర్లాం, రేగిడి

సైనికుల దాడిపై హర్షం



సైనికులకు సంఘీభావం తెలుపుతున్న కారుణ్య ఫౌండేషన్ సభ్యులు



సైనిక సేవలను మెచ్చుకుంటున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి



ఆపరేషన్ సిందూర్‌కు మద్దతు తెలుపుతున్న మాజీ సైనిక సంక్షేమ సంఘ సభ్యులు

బొబ్బిలి: పహల్గాం దాడికి ధీటుగా పాక్ ఉగ్రవాదులపై సైనికులు చేసిన దాడిపై మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, మాజీ సైనిక సంక్షేమ సంఘం సభ్యులు, కారుణ్య ఫౌండేషన్ సభ్యులు బుధవారం హర్షం వ్యక్తం చేశారు. ఆపరేషన్ సిందూర్ పేరిట భారత సైన్యం చేపట్టిన దుష్ట సంహారం కొనసాగాలంటే సైనికులకు మనమంతా మద్దతు పలకాలన్నారు. దేశానికి యుద్ధమే వస్తే రక్షణ శాఖ ఆదేశాలతో తిరిగి సైన్యంలో చేరి యుద్ధం చేస్తామని మాజీ సైనికులు అన్నారు. ప్రపంచ శాంతికి, సర్వమానవాళి ప్రశాంత జీవనానికి ఉగ్రవాదాన్ని రూపుమాపాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని మాజీ ఎమ్మెల్యే శంబంగి అన్నారు. సరిహద్దుల్లో దేశం కోసం పోరాడుతున్న సైనికులకు సెల్యూట్ అని కారుణ్య ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాజు తెలిపారు.

పన్నుల వసూళ్లు వేగవంతం చేయండి

రామభద్రపురం: పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని డీపీవో వెంకటేశ్వరరావు ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో పన్నుల వసూళ్లపై బుధవారం సమీక్ష నిర్వహించారు. స్వర్ణ పంచాయతీ అభివృద్ధి, పారిశుధ్యం, పన్నుల వసూళ్ల వంటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆర్. ఈశ్వరరావు, డిప్యూటీ ఎండీవో వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

వంగర: రైతులంతా భూమి శిస్తు బకాయిలు చెల్లించాలని వీఆర్‌వో ధనుంజయ కోరారు. మండలంలోని కొప్పర, కె.కొత్తవలస గ్రామ రైతులతో బుధవారం సమావేశమై పలు సూచనలు చేశారు.

నిర్లక్ష్యం 'పూడిక'పోయింది!



రేగిడి మండలం, వెంకంపేట దగ్గరున్న ఏకేఎల్(ఆకులోవకట్ట)గెడ్డ చూస్తే అధికారుల నిర్లక్ష్యం ఇట్టే అర్థమైపోతుంది. ఓ వైపు ఆక్రమణలతో గెడ్డ కుచించుకుపోతున్నా.. మరోవైపు పూడికలతో గెడ్డ నిండిపోతున్నా పట్టించుకోవడం లేదు. పిచ్చి మొక్కలు, వ్యర్థాలు సాగునీటి ప్రవాహానికి అడ్డుగా ఉండడంతో దిగువ ప్రాంతాలకు సక్రమంగా నీరు సరఫరా కావడం లేదు. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉనుకూరు–కొత్తచెలికానివలస ప్రాంతాల మధ్య వెయ్యి ఎకరాలకు సాగునీరు అందించే ఈ గెడ్డను బాగుచేయాలని అన్నదాతలు అభ్యర్థిస్తున్నారు. పేరుకుపోయిన పూడికలు తొలగించాలని కోరుతున్నారు. – రేగిడి

రహ'దారు'ణాలు

గ్రామీణ రహదారులు చాలా దారుణంగా ఉన్నాయి. పూర్తిగా ధ్వంసమైన రోడ్లు సహా రాళ్లుతేలిన, గుంతలుపడిన రోడ్లే గ్రామగ్రామాన కనిపిస్తున్నాయి. రేగిడి మండలం, మజ్జిరాముడుపేట నుంచి లక్ష్మీపురం, కొమెర రోడ్లు.. ఉంగరాడమెట్ట నుంచి వన్నలి రోడ్డు..తాటిపాడు జంక్షన్ నుంచి గుళ్లసీతారాంపురం రోడ్డు..సోమరాజుపేట నుంచి ఖండ్యాం గ్రామం వెళ్లే తారురోడ్డు అయితే మరీ అధ్వానంగా ఉన్నాయి. అడుగుకో గుంత, గజానికో గొయ్యి మాదిరి ఉండే ఈ రోడ్లు మీదుగా ప్రయాణించాలంటే నరకం చూస్తున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి, రోడ్లు బాగు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

– రేగిడి





న్యాయస్థానాలు ఆశ్రయించండి



కార్మిక హక్కులకు భంగం వాటిల్లితే న్యాయస్థానాలు ఆశ్రయించవచ్చని జూనియర్ సివిల్ జడ్జి కె.నైమిష తెలిపారు. అసంఘటిత రంగ కార్మికుల భద్రతా వారోత్సవాల్లో భాగంగా రాజాం పట్టణంలోని బొబ్బిలి రోడ్డులో కేశవ జ్యూట్‌మిల్లులో నాల్సా(అసంఘటిత రంగ కార్మికులకు న్యాయసేవల పథకం), కార్మిక చట్టాలు, భద్రతా చర్యలపై బుధవారం అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ కార్మికులంతా తమకు సంబంధించిన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, కార్మికులకు పని ప్రదేశంలో స్వచ్ఛమైన గాలి, నీరు, పరిశుభ్రతమైన వాతావరణం కల్పించాలన్నారు. కార్యక్రమంలో లేబర్ ఆఫీసర్ బి.కొండలరావు, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఎస్.మురళీధర్, న్యాయవాదులు ఆర్.విజయ్‌కుమార్, ఎం.శ్రీనివాసరావు, ఏఎస్‌ఐ కేవీ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు. రాజాంసిటీ

అల్లూరి పోరాటం స్ఫూర్తిదాయకం



బొబ్బిలిరూరల్: ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో రవికుమార్, కార్యాలయ సిబ్బంది

మన్యంవీరుడు, అడవిబిడ్డల ఆశాజ్యోతి అల్లూరి సీతారామరాజు వర్ధంతి బుధవారం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, గిరిజన సంఘాల నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులంతా అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. దేశ స్వాతంత్ర్య సాధనే లక్ష్యంగా అల్లూరి సీతారామరాజు చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. బ్రిటిష్ బానిస సంకెళ్ల నుంచి ప్రజలను విముక్తులను చేసేందుకు ఊపిరొదిలిన ప్రముఖుల్లో అల్లూరి ప్రథములన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతిఒక్కరం కృషి చేయాలని కోరారు.

– బొబ్బిలి, బొబ్బిలిరూరల్, బాడంగి



బాడంగిలో అల్లూరి సీతారామరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీడీవో రామకృష్ణ, సిబ్బంది



బొబ్బిలి కోటలో అల్లూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

108 రకాల స్వీట్లతో సారె



వాసవీ మాతకు 108 రకాల స్వీట్లతో సమర్పించిన సారె

రాజాం సిటీ: రాజాంలోని వాసవీకన్యకాపరమేశ్వరి ఆలయంలో భక్తులు బుధవారం కుంకుమ పూజలు జరిపారు. గణపతిశర్మ, నర్సింగరావు శర్మల సమక్షంలో పంచామృతాభిషేకాలు చేశారు. వాసవీమాతకు 108 రకాల స్వీట్లను నైవేద్యంగా సమర్పించారు. తిరువీధి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

వంగరలో వర్షం

వంగర: మండల కేంద్రం సహా మగ్గూరు, ఓనెఅగ్రహారం, ఎం.సీతారాంపురం తదితర గ్రామాల్లో బుధవారం వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు ఎండతీవ్రతతో ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజలు.. ఆ తర్వాత కొద్ది సమయానికి మేఘావృతమై వాన పడింది. దీంతో ఏర్పడిన చల్లని వాతావరణంతో ప్రజలు ఉపశమనం పొందారు.

సాగునీటి సరఫరా చర్యలు రూపొందించండి

బొబ్బిలి: మండలంలోని అలజంగి దాలిందొర చెరువు, పిరిడి గ్రామం వద్ద ఉన్న చుట్టు చెరువులకు వెంగళరాయసాగర్ ద్వారా సాగునీరు సరఫరాకు ప్రణాళికలు రూపొందించాలని ఎమ్మెల్యే బేబీనాయన ఆదేశించారు. స్థానిక కోటలో ఇరిగేషన్ అధికారులతో బుధవారం సమావేశమైన ఆయన.. రానున్న ఖరీఫ్ నాటికి రైతులకు సాగునీరు కల్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

చిన్నంనాయుడు మృతి పార్టీకి తీరనిలోటు

- మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

తెర్లాం: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, బొబ్బిలి ఏఎంసీ మాజీ డైరెక్టర్ చొక్కరి చిన్నంనాయుడు(చిన్న) మృతి పార్టీకి తీరనిలోటని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ బొబ్బిలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ శంబంగి వెంకట చినఅప్పలనాయుడు కొనియాడారు. మండలంలోని పెరుమాళి గ్రామంలో చిన్నంనాయుడు ఇటీవల మృతి చెందిన విషయం తెలుసుకున్న ఆయన..బుధవారం ఆ గ్రామం వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంతకుముందు చిన్నంనాయుడు చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని, ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు టి.సత్యంనాయుడు, జెడ్పీటీసీ ప్రతినిధి జి.రామారావు, పార్టీ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు జి.రాము తదితరులు పాల్గొన్నారు.



తెర్లాం: చిన్నంనాయుడు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలిరూరల్: మండలంలోని చింతాడ గ్రామ ఉపసర్పంచ్ మరడాన పార్వతమ్మ బుధవారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ఆ గ్రామానికి ఉదయం వెళ్లి, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె మృతికి గల కారణాలు అడిగి తెలుసుకుని, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ధైర్యంగా ఉండాలని ఏ అవసరం వచ్చినా తనను కలవాలని భరోసానిచ్చారు. ఆయన వెంట సర్పంచ్ బంకురు తిరుపతి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తమ్మిరెడ్డి దామోదర్ తదితరులు ఉన్నారు.

ఉపాధి పనులపై సమీక్ష

రాజాం: గ్రామీణ ప్రాంతాల్లో చేపడుతున్న ఉపాధి హామీ పథకం పనులను సక్రమంగా చేయించాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సూచించారు. స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో టీఏలు, ఎఫ్ఏలతో బుధవారం సమావేశం నిర్వహించి, ఉపాధి పనుల ప్రగతిపై బుధవారం సమీక్ష నిర్వహించారు.

ఆయన మాట్లాడుతూ నెలలో 100 పారంపాండ్లు తవ్వించాలని, రోజుకు రూ.307లు వేతనం గిట్టుబాటు అయ్యేలా పనులు జరిగేలా చూడాలన్నారు.

రాయితీపై పంపిణీకి పచ్చిరొట్ట సిద్ధం

బాడంగి: రానున్న ఖరీఫ్ సీజన్‌కు రైతులకు 50 శాతం రాయితీ(సబ్సిడీ)పై పచ్చిరొట్ట ఎరువులు సిద్ధంగా ఉన్నాయని ఏవో వ్యవసాయాధికారి కె.శిరీష బుధవారం తెలిపారు. అవసరమైన వారు సచివాలయంలో దరఖాస్తు చేసుకుని, విత్తనాలు పొందాలన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అగ్నిఅస్త్రం తయారీపై అవగాహన

రేగిడి: మండలంలోని చాటాయవలస గ్రామంలో అగ్నిఅస్త్రం తయారీపై బుధవారం అవగాహన కల్పించారు. ఏవో జి.మురళీకృష్ణ మాట్లాడుతూ తెగుళ్లను తట్టుకునే పంటలు కావాలన్నా, అధిక దిగుబడులు రావాలన్నా ప్రకృతి సేద్యం అవలంబించాలని కోరారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తూ పంటలు సాగు చేస్తే ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగుబడులు వస్తాయన్నారు. అనంతరం అగ్నిఅస్త్రం తయారీని ప్రయోగాత్మకంగా వివరించి, చూపారు.

ఆవుమూత్రం 10 లీటర్లు, పొగాకు కిలో, వెల్లుల్లి అరకిలో, పచ్చిమిర్చి అరకిలో, వేపాకులు 5 కిలోలను ఒక మట్టి కుండలో వేసి అందులో 10 లీటర్ల గోమూత్రం వేసి బాగా కలపాలన్నారు. మరగబెట్టిన తర్వాత పలుచని గుడ్డలో వడకట్టి డబ్బాలో వేసి మూడు నెలల వరకు నిల్వ ఉంచి వినియోగించుకోవచ్చన్నారు. ఎకరానికి 5 లీటర్ల అగ్నిఅస్త్రం 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోలన్నారు. ఆయన వెంట సర్పంచ్ కరణం గోవిందరావు, ఎంపీటీసీ పొగిరి అప్పలనాయుడు, ప్రకృతి వ్యవసాయం ఐసీఆర్‌పీలు పైల తవిటినాయుడు, రమణ తదితరులు పాల్గొన్నారు.



అగ్నిఅస్త్రం తయారీని చేసి చూపిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

సంతకవిటి: మండలంలోని గుళ్లసీతారాంపురంలో నవధాన్యాల సాగు–దాని ద్వారా కలిగే ప్రయోజనాలపై బుధవారం అవగాహన కల్పించారు. ప్రధాన పంట వేసే ముందు పొలాల్లో నవధాన్యాలు వేసుకుని సాగు చేయాలని, అవి మొక్కలైన 40 రోజుల తర్వాత అదే నేలలో దున్నితో నేల సారవంతమైన పంట దిగుబడి బాగుంటుందన్నారు.